సాక్షి
చిత్తూరు

శనివారం । 7 । జనవరి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు రూ.53,180

22 క్యారెట్లు ఒక గ్రాము రూ.4,810

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో) రూ.69,100

రిటైల్ వెండి గ్రాము రూ.71.60

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	28	18
తిరుపతి	27	18
తిరుమల	23	15
గూడూరు	28	21
నగరి	30	20

తిరుమలలో గదుల ధరల పెంపు

తిరుమల: తిరుమలలోని ఎంబీసీ విచారణ కేంద్రం పరిధిలోని అతిథిగృహాల ధరలను టీటీడీ పెంచింది. నారాయణగిరి అతిథిగృహం, వీవీ జీహెచ్, ఎస్వీ గెస్ట్ హౌస్, స్పెషల్ టైప్, నారాయణగిరి, ఏటీజీహెచ్ అతిథి గృహాలను ఇటీవల ఆధునీకరించింది. జనవరి నుంచి జీఎస్టీతో కలిపి ధరలను పెంచింది. ఎస్వీ గెస్ట్‌హౌస్ గదుల ధర రూ.2,000కు, నారాయణగిరి అతిథిగృహంలో రూ.1,700, కార్నర్ సూట్‌ను రూ.2,200కు పెంచింది. నారాయణగిరి 4ను, ఏటీజీహెచ్ అతిథిగృహాన్ని రూ.2,200కు, వీవీజీహెచ్ అతిథి గృహాన్ని రూ.1,500 నుంచి రూ.2,500కు పెంచింది.

న్యూస్‌రీల్

బోయకొండలో భక్తిశ్రద్ధలతో చండీహోమం



చండీహోమం నిర్వహిస్తున్న అర్చకులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం భక్తిశ్రద్ధలతో చండీహోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మిద్దింటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అర్చకుల బృందం అమ్మవారి ఉత్సవమూర్తికి శాస్త్రోక్తంగా పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. అనంతరం వేదపండితులు గోవర్ధనశర్మ తదితరుల వేద మంత్రాల నడుమ భక్తిశ్రద్ధలతో చండీహోమం జరిపారు. పూజా కార్యక్రమాల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు చండీహోమంలో పాల్గొన్నారు. నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అంతకు ముందు బోయకొండలో ప్రాతఃకాల సమయంలో రాహుకాల అభిషేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే గర్భాలయాన్ని శుద్ధి చేసి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పూజలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారిని పూలు, బంగారు నగలతో సుందరంగా ముస్తాబు చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

టెండర్ల ఆహ్వానం

బంగారుపాళెం: మొగిలీశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయడానికి ఆసక్తి కలిగిన వారి నుంచి టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొగిలీశ్వరస్వామి వార్షిక మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 15 నుంచి 25వ తేదీ వరకు 11 రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా దేవాలయానికి సున్నం, రంగులు వేయడం, 11 రోజుల పాటు ఆలయానికి విద్యుద్దీపాలంకరణ, భక్తుల సౌకర్యార్థం పందిళ్ల ఏర్పాటు, మంగళవాయిద్యాలు, స్వామి, అమ్మవార్ల ఉత్సవాలకు పుష్పాలంకరణ, ప్రభ అలంకరణకు పూలు, దండలు సరఫరా చేయాడానికి తక్కువ ధరతో కొటేషన్లను టెండర్లు సమర్పించాలని కోరారు. వివరాలకు దేవస్థానం కార్యాలయంలో సిబ్బందిని సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతానికే సీబీఎస్‌ఈ విధానం



సర్టిఫికెట్ అందజేస్తున్న డీఈఓ విజయేంద్రరావు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికే సీబీఎస్‌ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని డీఈఓ విజయేంద్రరావు అన్నారు. ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని పీఈఎస్ పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. డీఈఓ మాట్లాడుతూ సీబీఎస్‌ఈ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 352 ఉన్నత పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో 23 ఉన్నత పాఠశాలలు సీబీఎస్‌ఈ విధానానికి ఎంపికయ్యాయన్నారు. ఆ పాఠశాలల్లో పనిచేస్తున్న హెచ్‌ఎంలు, టీచర్లకు బోధనపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవితకు ప్రభుత్వం సీబీఎస్‌ఈ విధానం అమలులోకి తీసుకొస్తోందన్నారు. జిల్లాలో ఎంపికైన 23 పాఠశాలల్లో 7 రెసిడెన్షియల్, 8 కేజీబీవీ, 6 ఆదర్శ పాఠశాలలు, ఒక జిల్లా పరిషత్, ఒక ప్రభుత్వ పాఠశాల ఉన్నట్లు చెప్పారు. అందులో పనిచేసే 46 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. డీవైఈఓ చంద్రశేఖర్, డైట్ లెక్చరర్ చెంగల్‌రాజు, బీవీరెడ్డి పాఠశాల ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, శ్లోకా పాఠశాల ప్రిన్సిపల్ సింధు, కోర్స్ డైరెక్టర్ అరుణ్‌కుమార్, సెక్టోరల్ గుణశేఖర్‌రెడ్డి, ఏఎంఓ లావణ్య పాల్గొన్నారు.

కుప్పం రెడ్డెమ్మ పురస్కారానికి రచనల ఆహ్వానం

చిత్తూరు రూరల్: ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా రచయితల నుంచి రచనలు ఆహ్వానిస్తున్నట్లు కుప్పం రెడ్డెమ్మ సాహితీ ట్రస్టు వ్యవస్థాపకురాలు రామలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా రచయితలు నవల, కథానిక, చందోబద్ధ కవిత్వం, వచన కవిత్వం ప్రక్రియల్లో 2022వ సంవత్సరంలో ప్రచురించిన రచనలను మూడు కాపీలు కే రామలక్ష్మి , రామలక్ష్మి నర్సింగ్ హోమ్, సుందరయ్య వీధి, చిత్తూరు, చిత్తూరు జిల్లా చిరునామాకు జనవరి నెలాఖరులోపు పంపాలన్నారు. రచనలు ఎంపిక చేసి, శ్రీరామనవమి రోజున పురస్కారం ప్రదానం చేస్తామన్నారు.

• రంగనాథా..శ్రీరంగనాథా!



తిరుమల : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని టీటీడీ ఏర్పాటు చేసిన నమూనా ఆలయాన్ని ఆ సంస్థ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శుక్రవారం సందర్శించారు. శ్రీరంగ మండపం నమూనా చాలా చక్కగా ఉందని కొనియాడారు.

• పక్షిరాజుపై వరదరాజులు



కాణిపాకం: వరదరాజుల స్వామి శుక్రవారం రాత్రి గరుడ వాహనంపై విహరించారు.

• శాస్త్రోక్తం.. అరికట్లోత్సవం





శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం అరికట్లోత్సవం నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని నటరాజస్వామివారికి పాలు, పెరుగు, చందనం, నారికేళ, కలశ జలాలతో అభిషేకం నిర్వహించారు. - శ్రీకాళహస్తి

రెచ్చగొట్టి.. రచ్చచేసి!

ఏం తమ్ముళ్లూ.. ఇదేనా న్యాయం.. నన్ను కుప్పంలో తిరగనివ్వరా..?.. ఓడిస్తారా..?.. ఎక్కడపోయింది మీలో పౌరుషం..?.. నా ఆడపడుచులు.. అక్కచెల్లెమ్మల పోరాటం..? ఎందుకు భయం..? ఎవరి కోసం జంకుతున్నారు..?. రోషం లేదా..?.. వీరంగం సృష్టిస్తుంటే చూస్తూ ఊరుకోవాలా..? వీధిరౌడీల్లా ప్రవర్తిస్తున్న వారిని ఎదుర్కొనే దమ్ము లేదా..?.. నా నియోజకవర్గంలో వేరే పార్టీ ఫ్లెక్సీలు, జెండాలేంటి..?.. ఏం వాటిని పీకేయలేరా..?.. రెచ్చగొడితే చూస్తూ ఊరుకుంటారా..?.. వాళ్ల(వైఎస్సార్‌సీపీ నాయకులు)ను ఎదుర్కొనే ధైర్యం లేదా.. ఏడు సార్లు గెలిచాను.. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్నాను.. నా నియోజకవర్గంలో పోలీసుల పెత్తనం ఏంటి.. మీ అంతు చూస్తా..? ఎదురు కేసులు పెడతా..? ఎక్కడున్నా వదిలిపెట్టను.

.. ఇదీ టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుప్పం వచ్చిన ప్రతిసారీ చెబుతున్న రెచ్చగొట్టే మాటలు. ఆ పార్టీ కార్యకర్తలకు లేనిపోనివి నూరిపోసి రాద్ధాంతం సృష్టించడం.. గొడవలు రేపి గందరగోళం చేయడం ఆయనకు అలవాటుగా మారింది. ప్రస్తుతం అధికారం కోల్పోయి నిస్సహాయ స్థితిలో మరింత రెచ్చిపోతూ.. కొందరు కార్యకర్తలను వెంటబెట్టుకుని అలజడి రేపి, చల్లగా జారుకోవడం రివాజుగా మారుతోంది. మూడు రోజుల పర్యటన ముగిసిన నేపథ్యంలో బాబు 'షో'లపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..



పోలీసులపై విరుచుకుపడుతున్న చంద్రబాబు

- కుప్పంలో బాబు షో
- ముగిసిన మూడు రోజుల పర్యటన
- మూడున్నరేళ్లలో 19 సార్లు కుప్పం రాక
- వచ్చిన ప్రతిసారీ రచ్చే
- సానుభూతి, పబ్లిసిటీ కోసం పాట్లు
- గొడవలు సృష్టించి.. దాడులు చేయిస్తున్న వైనం
- అంతా గమనిస్తున్న జిల్లా ప్రజానీకం

సాక్షి ప్రతినిధి, తిరుపతి: మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు కుప్పం పర్యటన ప్రతిసారీ రచ్చరచ్చగా మారుతోంది. వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు చించడం, జెండాలు పీకడం.. విగ్రహాలు ధ్వంసం చేయడం.. దిమ్మెలు పగులగొట్టడంతో మొదలవుతోంది. స్థానిక క్యాడర్‌ను రెచ్చగొట్టి.. కొట్టుకునే స్థాయికి తీసుకెళ్లడం.. ఆపై తన వాళ్లపైనే కేసులు నమోదు చేయించి స్థానికుల నుంచి సానుభూతి పొందడం నిత్యకృత్యంగా మారుతోంది. తర్వాత తన అనుకూల మీడియా ద్వారా పబ్లిసిటీ చేయించుకోవడం అలవాటుగా మారింది. ఇప్పుడు దీనిపై జిల్లాలో సర్వత్రా చర్చ జరుగుతోంది.

ప్రశ్నిస్తే దాడే

2019 జూలై 2, 3 తేదీల్లో చంద్రబాబునాయుడు కుప్పంలో సుడిగాలి పర్యటన చేపట్టారు. తన హయాంలో కొన్ని తప్పులు జరిగాయని, కుప్పాన్ని నిర్లక్ష్యం చేశానని ఊరూరా తిరిగి చెప్పుకొచ్చారు. అయినా జనం నమ్మలేదు. బాబు సభలకు పెద్దగా వెళ్లలేదు. అర్ధరాత్రి శాంతిపురం మండలానికి చేరుకున్న చంద్రబాబు 50 మంది కూడా లేని సభలో గంటకుపైగా ప్రసంగించారు. అదే సమయంలో



రామకుప్పం: టీడీపీ కార్యకర్తల వీరంగం(ఫైల్)

బస్సులో ఉన్న ప్రయాణికుడు ఒకరు కిందకు దిగి కేకలు వేశారు. బస్సులో చిన్న పిల్లలు ఉన్నారని.. వారు పాల కోసం ఏడుస్తున్నారని, అర్ధరాత్రిలో ఏమిటీ పంచాయితీ అని ప్రశ్నించారు. ఈ పరిణామాన్ని జీర్ణించుకోలేని చంద్రబాబు టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి ఆ ప్రయాణికుడిపై దాడిచేయించారు. ఈ సంఘటనకు సంబంధించి ఫొటోలు తీస్తున్న సాక్షి ప్రతినిధిపైనా పిడిగుద్దుల వర్షం కురిపించారు. సెల్‌ఫోన్ లాక్కుని, కిందకేసి పగులగొట్టించారు. ఆ తర్వాత అధికారులపై చిర్రుబుర్రులాడారు.

అధికారం లేక.. ఓటమిని అంగీకరించక..

జిల్లాలో 2019 సాధారణ ఎన్నికల తర్వాత టీడీపీ పరిస్థితి మరీ దారుణమైంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 13 అసెంబ్లీ, మూడు ఎంపీ స్థానాలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుంది. ఆ తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేసింది. ముఖ్యంగా చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో టీడీపీని ఘోరంగా దెబ్బకొట్టింది. ఈ ఓటముల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి చంద్రబాబు టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి దాడులు చేయించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. పోలీసులను

మూడున్నరేళ్లలో చంద్రబాబు కుప్పం పర్యటన వివరాలు

సంవత్సరం	నెల	తేదీ	ఎన్ని రోజులు
2019	జూలై	2,3	2
2020	ఫిబ్రవరి	24,25	2
2021	అక్టోబర్	28,30	2
2022	జనవరి	6,7,8	3
2022	మే	11,12,13	3
2022	ఆగస్టు	24, 25, 26	3
2023	జనవరి	4,5,6	3

సైతం లెక్కచేయకుండా వారితో దూషణలకు దిగడం.. ఆరోపణలు చేయడం రివాజుగా మారుతోంది. తర్వాత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలేసి చల్లగా హైదరాబాద్‌కు జారుకోవడం నిత్యకృత్యంగా మారుతోంది.

అర్జీ ఇవ్వడానికి వస్తే చితక బాదేశారు

- 2020 ఫిబ్రవరిలోనూ టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టి రచ్చ చేయించారు.
- 2021 అక్టోబర్‌లో కుప్పం ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సభలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ ఉద్యోగి వినతి పత్రం ఇచ్చేందుకు వస్తే వైఎస్సార్‌సీపీ రౌడీలు వచ్చారంటూ టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టారు. దీంతో వారు రెచ్చిపోయి ఆ వ్యక్తిని చితక బాదేశారు. చివరకు అతని బ్యాగు తెరిచి చూస్తే వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చినట్లు గుర్తించి ఉలుకు పలుకు లేకుండా అక్కడి నుంచి వెనుదిరిగారు.
- గత ఏడాది జనవరి, మే నెలల్లో వైఎస్సార్‌సీపీ జెండాలు, ఫ్లెక్సీలు, దిమ్మెలు ధ్వంసం చేయించి రచ్చరచ్చచేశారు. తన పర్యటనను అడ్డుకునేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు కావాలనే ఇలా చేస్తున్నారంటూ టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టారు.



- గత ఆగస్టులో రామకుప్పం మండలం, కొల్లుపల్లెలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీలు, దిమ్మెపై ఉన్న జెండాను ధ్వంసం చేయించారు. అడ్డుకున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కర్రలతో దాడిచేయించారు. పారిపోతున్న వారి వెంటబడి తరిమికొట్టించారు. విచక్షణారహితంగా రాళ్లు రువ్వించి పలువురిని గాయపరిచారు. ఈ దాడిలో పోలీసులు సైతం గాయపడ్డారు.

బాబు ఫ్లాప్ 'షో'

సాక్షి, చిత్తూరు: టీడీపీ అధినేత చంద్రబాబు మూడు రోజుల కుప్పం పర్యటన తుస్సుమంది. కందుకూరు, గుంటూరు ఘటనల నేపథ్యంలో ప్రజలు పెద్దగా రాకపోవడంతో ఫ్లాప్ షోగా ముగిసింది. రోడ్‌షో, సభ కార్యక్రమాలకు వాడే ప్రచార వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో చంద్రబాబు రెచ్చిపోయారు. ఆయన అనుచరులతో కుట్రపూరితంగా ఎక్కడికక్కడ దాడులు చేయించారు. పార్టీ కార్యకర్తలు, అద్దె మనుషులను రెచ్చగొట్టారు. కర్రలు చేతబట్టి పోలీసులపై దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో కొందరు పోలీసులకు సైతం గాయాలయ్యాయి. శాంతిపురం మండలంలో నిబంధనలకు విరుద్ధంగానే ఇరుకు రోడ్ల మధ్య రోడ్‌షో నిర్వహించారు. తన రోడ్‌షోను మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలతో గ్లోబల్ ప్రచారం చేయించుకున్నారు. కేవలం 300 మీటర్ల దూరం పాదయాత్ర చేసి జనాన్ని మెప్పించేపనిలో పడ్డారు. పెయిడ్ ఆర్టిస్టులను ఎంపిక చేసుకుని కేసీ ఆస్పత్రి కేంద్రంగా సరికొత్త డ్రామాకు తెరతీశారు. 'వచ్చేది మన ప్రభుత్వమే.. పోలీసులకు భయపడొద్దు, కేసులకు వెరవద్దు.. భయపడితే ఇబ్బందులు పడతాం..' అంటూ కార్యకర్తలను రెచ్చగొట్టారు. శుక్రవారం గుడుపల్లెకు చేరుకున్న చంద్రబాబు పోలీసులతో గొడవకు దిగారు. తన ప్రచార వాహనాన్ని ఇవ్వాలని రాద్ధాంతం చేశారు. బస్టాండ్ వద్ద ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. తర్వాత రోడ్డు మార్గాన బెంగళూరు వైపు బయల్దేరి వెళ్లారు.

పురాతన సంప్రదాయం..పునర్నిర్మాణం



గంగమ్మ ఆలయ నిర్మాణానికి పునాది రాయి వేసే కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరిషా

- గంగమ్మ ఆలయానికి పూర్వవైభవం

తిరుపతి కల్చరల్: శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులకు శుక్రవారం శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన శబ్ద గ్రహ శిలతో భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డెప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, అభినయ్‌రెడ్డి అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే భూమన మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి చెల్లెలుగా భక్తకోటి పూజలందుకుంటున్న తాతయ్యగుంట అమ్మవారి ఆలయాన్ని మరింత అద్భుత రీతిలో నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే భక్తులు తిరుపతి గంగమ్మ దర్శనానంతరం తిరుమల శ్రీవారిని దర్శించే పూర్వ ఆనవాయితీని పునఃప్రారంభించనున్నట్లు తెలిపారు. తిరుపతి గంగమ్మను దర్శించి అమ్మవారి ఆలయ చరిత్రను గుర్తించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలయ పునఃనిర్మాణ పనులకు ఆమోదం తెలిపి నిధుల మంజూరుకు సహకరించారన్నారు. అమ్మవారి విశిష్టత ఆవిష్కరించే రీతిలో శిల్ప కళా నైపుణ్యంతో ఆలయ నిర్మాణం చేపట్టడంతోపాటు భక్తుల సౌకర్యార్థం వెంటిలేషన్‌తో సెంట్రల్ ఏసీ సౌకర్యం కల్పిస్తామన్నారు. టీటీడీ, దేవదాయశాఖ సంయుక్తంగా మొత్తం రూ.12 కోట్లతో అమ్మవారి ఆలయాన్ని నిర్మిస్తున్నట్టు చెప్పారు. వచ్చే గంగజాతరకు పది రోజులు ముందే ఆలయ నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఆలయ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ ఎం.మునికృష్ణయ్య, టీటీడీ చీఫ్ ఇంజనీర్ నాగేశ్వరరావు, రామచంద్రారెడ్డి, స్థపతి మునస్వామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాలగిరి ప్రతాప్‌రెడ్డి, దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రూ.5 లక్షల విరాళం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణానికి అమ్మవారి భక్తులు రూ.5 లక్షలు విరాళంగా అందజేశారు. ఈమేరకు ఎంకే.రుషిత రూ.4.5 లక్షలు, సాయిరితేష్‌రెడ్డి రూ.50 వేలు మొత్తం రూ.5 లక్షలు అందజేశారు.

అభివృద్ధే ధ్యేయంగా పాలన

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- నాడు–నేడు పనులకు భూమిపూజ
- పింఛన్లు పంపిణీ చేసిన మంత్రి పెద్దిరెడ్డి
- ఇంటికి వద్దకే ప్రభుత్వ సేవలు



తమ్మినాయనపల్లెలో ఆర్వో ప్లాంటు ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

సోమల: పేదల సంక్షేమంతోపాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తూ అన్ని ప్రాంతాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖామంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం సోమల మండలంలో మూడో రోజు పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి ఇరికిపెంట, సోమల, నెల్లిమంద, తమ్మినాయునిపల్లె, కందూరు పంచాయతీల్లో పర్యటించారు. 37 గ్రామాల్లో ప్రజలతో మమేకమయ్యారు. ప్రతి చోట మంత్రి పెద్దిరెడ్డికి ప్రజలు మంగళహారతులతో స్వాగతం పలికారు. సంక్షేమ పథకాలపై ఆరా తీస్తూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

సచివాలయ వ్యవస్థ గ్రామీణులకు వరం

సచివాలయ వ్యవస్థ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వరంలాంటిదని మంత్రి పెద్దిరెడ్డి స్పష్టం చేశారు. దేశంలోని పొరుగు రాష్ట్రాలు సచివాలయ వ్యవస్థ అమలు తీరును పరిశీలించి, వారి ప్రాంతాల్లోనూ అమలు చేయడానికి చర్యలు తీసుకోవడం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ సుపరిపాలనకు నిదర్శనమన్నారు. గ్రామాల్లో ఇంటి వద్దకే వలంటీర్ల సహకారంతో అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూరుతుందని చెప్పారు. ఇంటి వద్దకే వైద్య సేవలందించడం, గ్రామస్థాయిలో అధికార యంత్రాంగాన్ని నియమించి, శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి, ఆదర్శపాలన సాగిస్తున్నట్లు తెలిపారు.

నాడు–నేడుతో స్కూళ్లు, ఆస్పత్రులకు మహర్దశ

నాడు–నేడు కార్యక్రమంతో పాఠశాలలు, ఆస్పత్రులకు మహర్దశ వచ్చిందని మంత్రి పెద్దిరెడ్డి అన్నారు. సోమల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రూ.29 లక్షలతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో పాఠశాలలు, వైద్యశాలల మరమ్మతులు, కొత్తభవనాల నిర్మాణం, సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి అభివృద్ధి చేశామన్నారు. శిథిలావస్థకు చేరువలో ఉన్న వ్యవస్థకు జీవం పోసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు ఇస్తాం

ప్రతి ఇంటికీ సరిపడా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు. తమ్మినాయనపల్లెలో వ్యవసాయ సలహామండలి సభ్యుడు సుధీర్‌రెడ్డితో కలిసి ఆర్వో ప్లాంటును ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు జింకా చలపతి, ఎంపీపీ ఈశ్వరయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు అమాస కుసుమ, వైస్ ఎంపీపీ సయ్యద్‌బాషా, ఏఎంసీ చైర్మన్ అరుణమ్మ, సర్పంచ్‌లు రెడ్డెప్ప, రాజేశ్వరి, చంద్రకళ, సురేంద్రరెడ్డి, బాషామసూద్, ఎంపీటీసీ సభ్యులు హరినాథ్, సావిత్రమ్మ పాల్గొన్నారు.



నెల్లిమందలో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి

క్లుప్తంగా

ఏపీపీఎస్సీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించండి

- రేపు పరీక్షలు
- జిల్లాలో 4 కేంద్రాల ఏర్పాటు
- డీఆర్వో రాజశేఖర్



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో రాజశేఖర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్‌లో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్వో మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన అనంతరం మొదటి సారిగా జిల్లాలో ఏపీపీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏపీపీఎస్సీ పరీక్షలకు చిత్తూరు పట్టణంలో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కాలేజ్(ఓవర్ బ్రిడ్జి పక్కన) మిట్టూరు, విజయం జూనియర్ కాలేజ్, ఆఫీసర్ లైన్, బాపు బాల భవన్, శ్రీనివాస ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (సీతమ్స్), అపోలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్, తిరుపతి మెయిన్ రోడ్, మురుకంబట్టు కళాశాలల్లో పరీక్షల నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులకు ఏవైనా సందేహాలుంటే 90145 50850, 90145 50897, 76709 00913 నంబర్లకు ఫోన్ చేసి, తెలుసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ పరీక్షల విభాగం అదనపు సహాయక కార్యదర్శి వెంకటలక్ష్మి, మాధవీలత, శ్రీనివాసులు రెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్లు దేవేందర్, జీవరత్నం, వెంకటాచలపతి, రహీమ్ సిరాజున్నిసా బేగం, లైజన్ ఆఫీసర్ నరసింహులు, మధుసూదన్‌రెడ్డి, చిన్నారెడ్డి, ఎస్.మూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ సీనియర్ నేత

- మూడు గ్రామాల నాయకుల చేరిక
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన మంత్రి పెద్దిరెడ్డి
- అత్యధిక మెజార్టీ సాధిస్తాం



నెల్లిమంద కమ్మపల్లెలో పార్టీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

చౌడేపల్లె(సోమల): రాష్ట్ర విద్యుత్, అటవీ, గనుల శాఖామంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమల మండలంలో మూడోరోజు పల్లెబాట కార్యక్రమం నిర్వహిస్తున్న సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి నెల్లిమంద కమ్మపల్లె గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ నాయుడు పార్టీలో చేరగా, ఆయనకు కండువా వేసి ఆహ్వానించారు. ఆయనతోపాటు మరో ఇరవై కుటుంబాలవారు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో రెడ్డిబాషా, ముబాకర్, బావాజీ, సుబ్రమణ్యంనాయుడు, రహీంబాషా, వెంకట్రామయ్య, షంషీర్, బాబు, మధు, బషీర్ ఉన్నారు. అలాగే నవాబుపేట, బురుపల్లెలో అజీజ్, జైబూన్‌తోపాటు మరో పది కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి వారికి కూడా పార్టీ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పెద్దిరెడ్డి పుంగనూరు నియోజకవర్గంతోపాటు తమ మండలానికి చేస్తున్న అభివృద్ధి చూసి ఆకర్షితులైనట్లు తెలిపారు. ఏకష్టమొచ్చినా వెన్నంటి ఉంటూ ఆదుకొనే స్వభావం ఉన్న మంత్రి వెంట నడవడానికి సిద్ధమై పార్టీలో చేరినట్లు చెప్పారు. గ్రామ స్థాయి నుంచి పార్టీను మరింత బలోపేతం చేసి, రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీ సాధించే దిశగా అందరితో కలిసి ఐకమత్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, పుంగనూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు జింకా వెంకటాచలపతి, ఎంపీపీ ఈశ్వరయ్య, జెడ్పీటీసీ సభ్యురాలు అమాస కుసుమ, వైస్ ఎంపీపీ సయ్యద్‌బాషా, కోఆప్షన్ సభ్యుడు మస్తాన్‌బాషా, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, పార్టీ అధ్యక్షుడు గంగాధర రాయల్, పాల్గొన్నారు.

వంద కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని గడ్డూరు గ్రామానికి చెందిన వంద టీడీపీ కుటుంబాల ప్రజలు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలను కప్పి, ఆయన సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట: ఉమ్మడి చిత్తూరు జిల్లా ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను 2022–23 విద్యాసంవత్సరానికి కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ కొండిన్యసాయి తెలిపారు. జేఎల్, పీజీటీ, టీజీటీ పోస్టులకు డిగ్రీ, పీజీ, బీఈడీ కోర్సులలో 50 శాతం మార్కులతోపాటు ఏపీ టెట్ క్వాలిఫై అయ్యి ఉండాలన్నారు. పీఈటీ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇండర్ డిగ్రీతోపాటు వ్యాయామ విద్యలో పీజీ డిప్లొమా కానీ, బీపీఎడ్ కానీ, పీఈటీ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణతతోపాటు ఆర్ట్స్ కోర్సులో ప్రభుత్వ డిప్లొమా, హయ్యర్ గ్రేడ్ డ్రాయింగ్ టెక్నికల్ టీచర్ సర్టిఫి కేట్ కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఇంగ్లిష్ మీడియంలో చదివి ఉండాలని తెలిపారు. దరఖాస్తు ఫారాలు జిల్లాలోని అన్ని గురుకుల పాఠశాలల్లో లభిస్తాయని, పూర్తి చేసిన దరఖాస్తులను అభ్యర్థులు ఈనెల 13వ తేదీ సాయంత్రం 5గంటల లోపు రేణిగుంటలోని ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో సమర్పించాలన్నారు. అభ్యర్థులు ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు రేణిగుంట ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్‌లో జరగనున్న డెమో, ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. జూనియర్ లెక్చరర్ ఫిజిక్స్–1 (ఓసీ–మహిళ), కెమిస్ట్రీ–1 (ఓసీ–మహిళ), బోటనీ–1 (ఎస్సీ– మహిళ), జువాలజీ–1 (ఓసీ–మహిళ), సి విక్స్– 1 (ఓసీ–మహిళ). పీజీ టీ - మాథ్స్–1 (ఓసీ–మహిళ), ఫిజిక్స్– 1 (ఎస్సీ–మహిళ), బయాలజీ–1 (ఓసీ–మహిళ), సోషియల్– 1(ఎస్సీ– మహిళ). టీజీటీ– ఇంగ్లిష్ -2,(ఓసీ– పీహెచ్‌సీ– మహిళ, ఓసీ–మహిళ), గణితం– 1(బీసీ–సీ), సైన్స్ -3(ఓసీ– పీహెచ్‌సీ– మహిళ, బీసీ–సీ, ఓసీ), సోషియల్–04 (ఎస్టీ–మహిళ, బీసీ -సీ, ఎస్సీ, ఓసీ–మహిళ). ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ టీచర్– 05– (ఎస్సీ– మహిళ, ఓసీ–పీహెచ్‌సీ– మహిళ, బీసీ–బీ–మహిళ, ఓసీ, ఓసీ–మహిళ. పీఈటీ–01– ఓసీ–మహిళ.

నేటి నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి వార్డుబాట



పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి

పుంగనూరు: లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి శనివారం నుంచి రెండు రోజుల పాటు మున్సిపాలిటీలో వార్డు బాట నిర్వహించనున్నట్లు చైర్మన్ అలీమ్ బాషా తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 7 గంటలకు రాజీవ్‌గాంధీ వీధి, మహబూబ్‌నగర్, అంబా చిన్నప్పవీధి ప్రాంతాల నుంచి 7, 8, 3 వార్డుల్లో తొలి రోజు పర్యటించనున్నట్లు చెప్పారు. 9వ తేదీ 1, 2, 31 వార్డుల్లో ఎంపీ పర్యటించనున్నట్లు తెలిపారు. పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన రోడ్లు, కాలువ పనులను ఎంపీ ప్రారంభిస్తారని చైర్మన్ తెలిపారు. ఎంపీ ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమవుతారని చైర్మన్ తెలిపారు.

ప్రజలకు ఇదేమి ఖర్మ చంద్రబాబూ!



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

- రాక్షస మనస్తత్వం ఉన్న చంద్రబాబుకు ప్రజల కష్టాలు తెలియవు
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజం

వెదురుకుప్పం: అధికార దాహంతో చంద్రబాబు రాష్ట్రాన్ని రావణ కాష్టంలా తయారు చేస్తున్నారని, ఆయన ఎక్కడ అడుగు పెడితే అక్కడ అరిష్టాలు జరిగి ప్రజలు వణికిపోతున్నారని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ధ్వజమెత్తారు. శుక్రవారం బ్రాహ్మణపల్లెలో మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం పేదవాడి గురించి పట్టించుకోకుండా వారిని కేవలం ఓటుకోసం పావుగా వాడుకున్నట్లు గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల కుటుంబాల్లో ఆనందం చూడాలన్నా సంలక్పంతో కనివినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే టీడీపీ వాటిని అందకుండా మోకాలడ్డుతున్నట్లు ఆరోపించారు. చంద్రబాబు పేద ప్రజలకు మంచి చేయరనీ.. ఇంకొకరు చేసినా చూసి ఓర్చుకోలేరన్నారు. పేదవాడి ఆకలి తీర్చితే అది ఖర్మా.. గూడు లేని పేదలకు ఉచితంగా పక్కా గృహాలు నిర్మించి ఇస్తే అది వారి ఖర్మా.. పేదవాడి ఇంట్లో ఇంగ్లీషు మీడియంతో ఉన్నత చదువుల కోసం ఆరాటపడితే అది ఖర్మా.. పిల్లలను బడికి పంపే తల్లిదండ్రులకు అమ్మ ఒడి కింద డబ్బులు ఇస్తే అది ఖర్మా.. కుల మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు చేరవేస్తే అది ప్రజలు చేసుకున్న ఖర్మా.. అంటూ ప్రతి పక్షనేత చంద్రబాబుపై విరుచుకుపడ్డారన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ఇదేం ఖర్మ పేరుతో రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు గమనించాలన్నారు. బాబు పేదల పాలిట శాపంగా మారడం రాష్ట్రానికి పట్టిన ఖర్మ అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. రాక్షస మనస్తత్వం ఉన్న చంద్రబాబుకు ప్రజల కష్టాలు తెలియవన్నారు.

బాబూ.. పెద్దిరెడ్డిపై విమర్శలు మానుకో!



మాట్లాడుతున్న ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: మంత్రి పెద్దిరెడ్డిపై చంద్రబాబు విమర్శలు మానుకోవాలని, లేకపోతే ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెబుతారని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం చిత్తూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంత అనుభవం ఉన్న బాబు జిల్లాలో పెద్దాయన్ని దూషించడం సరికాదన్నారు. జిల్లాలో జరిగిన సర్పంచ్, మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఎన్నికల్లో పెద్దిరెడ్డి నాయకత్వంలో 95 శాతం పైగా సీట్లు గెలుచుకున్నామని చెప్పారు. 1973లో ఎస్వీ యూనివర్సిటీ విద్యార్థి సంఘం చైర్మన్‌గా పెద్దిరెడ్డి ఏకగ్రీవంగా గెలిచారని, అప్పట్లో ఆయన్ని అడ్డుకోవడానికి బాబు ఎంత ప్రయత్నించినా జరగలేదన్నారు. మైనింగ్, ఇసుక మాఫియా అంటూ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రమాణం చేసి, ఆ రోపణలను నిరూపించాలన్నారు. 2004, 2014లో టీడీపీలో ఎమ్మెల్యేగా టికెటు ఇస్తా నని చెప్పి తనని బాబు మోసం చేశాడని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అ న్నారు. తనతో పాటు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, శ్రీకాళహస్తిలో ఎస్వీ నాయుడు, చిత్తూరులోని ఏఎస్ మనోహర్ ఇలా పలువురికి ఎ మ్మెల్యే టికెట్లు ఇస్తానని మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదన్నారు. ద్రోహనికి పర్యాయ పదం బాబు అని కల్యాణదుర్గం నియోజకవర్గ కన్వీనర్ ఎంఆర్సీ రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర నాయకుడు మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. దమ్ముంటే రానున్న ఎన్నికల్లో చంద్రగిరిలో నారా లోకేష్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయాలని సవాల్ విసిరారు. సమావేశంలో మేయర్ అముద, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, నాయకులు చేరి రాజా, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



మృతి చెందిన ఇనాయతుల్లా

వి.కోట: ఆపి ఉన్న బైకును ఢీకొని ద్విచక్ర వాహనచోదకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వి.కోట- పేర్నంబట్ రోడ్డులోని బీమనేరు గ్రామం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నాయకనేరి గ్రామానికి చెందిన వసీమ్ షాబ్ కుమారుడు ఇనాయతుల్లా (28) వి.కోట నుంచి తన స్వగ్రామానికి వెళుతున్నాడు. అదే సమయంలో వి.కోట- పేర్నంబట్ రోడ్డులోని బీమనేరు గ్రామం వద్ద పురుషోత్తం రెడ్డి అనే వ్యక్తి తన ద్విక్రవాహనాన్ని ఆపి, దానిపై ఉన్నాడు. ఈ తరుణంలో ఇనాయతుల్లా తన ద్విచక్రవాహనంతో ఆపి ఉన్న బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇనాయతుల్లా తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఫిట్స్ ఉండడంతో గాయాలు చిన్నవైనా, కింద పడిన వెంటనే ఫిట్స్ రావడంతో అతను మృతి చెందాడని ఎస్ఐ రామ్‌భూపాల్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.